
ఎన్నాళ్లీ ఎదురుచూపులు!?



- నిధులు లేక గ్రామాలు ఆగమాగం
- నేటికీ విడుదల కాని బకాయిలు
- అప్పుల ఊబిలో మాజీ సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు

పినపాక: మండలంలో పంచాయతీ పాలన పూర్తిగా గాడి తప్పింది. పంచాయతీల పాలకమండళ్ల పదవీకాలం ముగిసి 18 నెలలు కావస్తున్నా.. ప్రభుత్వం కొత్త ఎన్నికల మాటే ఎత్తడం లేదు. అయితే మాజీల పదవీకాలం ముగించడానికి ముందు, ఆ తరువాత తోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో స్థానిక నిధులు లేక నాడు సర్పంచులతోపాటు నేడు కార్యదర్శులు అప్పులు చేసి పనులు నెట్టుకొస్తున్నారు. చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిధులు లేక అవస్థలు..

పంచాయతీలలో నిధులు లేకపోవడంతో గ్రామాల నిర్వహణ కష్టతరంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించ లేని పరిస్థితి. వాస్తవానికి సర్పంచ్‌ల పదవీకాలం ముగియకమునుపే ఈ పరిస్థితి దాపురించింది. అప్పటి నుంచీ వీధిలైట్లు వెలిగించడానికి, తాగు నీటి మోటర్ల నిర్వహణకు, ట్రాక్టర్ల మెయింటెనెన్స్‌కు, నూతనంగా ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలకు కూడా అప్పులు చేసి పనులు నిర్వహిస్తున్నారు. అరకొరగా వస్తున్న నిధులు పంచాయతీ సిబ్బంది జీతాలకు, ట్రాక్టర్లకు డీజిల్ ఖర్చులకు కూడా సరిపోవడం లేదు. దీంతో పంచాయతీ సిబ్బందికి కూడా వేతనాలు బకాయిలు పడినట్లు తాజా మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న వర్షాకాలంలో మురికి కాలువల శుభ్రత, దోమల మందు పిచికారీ, బ్లీచింగ్ చల్లడం వంటి అత్యవసర పనులు చేపట్టడానికి ఏం చేయాలో తెలియక అధికారులు, కార్యదర్శులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

కాంట్రాక్టర్ల తిప్పలు

పంచాయతీలలో అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. అధిక మొత్తంలో డబ్బులు అప్పులకు తెచ్చి పనులు పూర్తి చేసిన వారికి 18 నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా బిల్లులు రాలేదు. దీంతో కాంట్రాక్టర్లు అప్పుల ఊబిలో కూరుకుపోయి, తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక నానా తిప్పలు పడుతున్నారు. కొందరు కాంట్రాక్టర్లు తమ ఆస్తులను అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. బిల్లుల చెల్లింపు కోసం సంబంధిత అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదర్శనలు, ధర్నాలు చేస్తున్నా ఫలితం శూన్యంగా ఉందని వారు వాపోతున్నారు.

కోర్టు తీర్పుతో ఊరట

పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఈ మధ్య కాలంలో మాజీ సర్పంచులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. సెప్టెంబర్ 30లోగా పంచాయతీ ఎన్నికల ప్రక్రియను ముగించాలని తీర్పు ఇవ్వడంతో కొందరు మాజీ సర్పంచుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. అయితే, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, నిధుల కొరత వల్ల కొత్త పాలకవర్గాలు ఏర్పడినా పరిస్థితి మెరుగుపడుతుందా అనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. ఈ సంక్షోభం నుంచి పంచాయతీలను గట్టెక్కించడానికి ప్రభుత్వం తక్షణమే స్పందించి, నిధులు విడుదల చేయాలని, ఎన్నికలను నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వడ్డీలు కడుతున్నాం..



గత ప్రభుత్వ హయాంలో అప్పులు చేసి పనులు చేపట్టాం. నెలలు గడుస్తున్నా.. ఒక్క రూపాయి కూడా రావడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయింది. ఇప్పుడు అప్పులకు నెలనెలా వడ్డీలు కడుతున్నాం.

– కృష్ణారెడ్డి, కాంట్రాక్టర్, బయ్యారం

ఇంటి మీదకు అప్పులవాళ్లు..



పంచాయతీలో నిధులు లేక బంగారం కొదవ పెట్టి, అప్పులు చేసి పనులు చేసాం. వీధిలైట్లు, మోటార్ల రిపేర్లకు, ప్రకృతి వనాలకు నిధులు వెచ్చించాం. అప్పుల వాళ్ళు ఇంటి మీదకు రావడంతో ఆత్మహత్య శరణ్యం అనిపిస్తోంది.

– గుమ్మడి అనంత, మాజీ సర్పంచ్, జగ్గారం

బిల్లులు చెల్లిస్తాం..



పంచాయతీల్లో కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచుల బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవం. పంచాయతీల్లో డబ్బులు పడిన వెంటనే వాటిని చెల్లిస్తాం. కొందరికి బిల్లులు చెల్లింపు ప్రక్రియ ప్రారంభించాం. త్వరలోనే అందరికీ బిల్లులు చెల్లిస్తాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీఓ, పినపాక

అటవీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: గిరిజనులు అడవుల సహజ భాగస్వాములని, వారి హక్కులను గౌరవించడంలో బాధ్యతగా ఫారెస్ట్ అధికారులు వ్యవహరించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బంగ్లాస్ ఏరియాలోని ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో ఐదు మండలాల అటవీ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోడు భూముల సమస్య విషయంలో అటవీ శాఖ అధికారులు సామరస్యంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా గిరిజనులు, గిరిజనేతరులు పేదలు సాగు చేసుకుంటున్న పోడు భూముల విషయంలో పోడు రైతులను ఫారెస్ట్ అధికారులు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. ఏ గ్రామంలో పోడు సమస్య వచ్చినా అధికారులు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పట్టా లేని సాగులో ఉన్న పాత పోడు భూముల విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి వారికి పట్టాలు ఇప్పించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. అటవీ అధికారులు స్థానిక గిరిజనుల ఆర్థిక సామాజిక అభివృద్ధికి అనుకూలంగా నూతన ఆవిష్కరణాత్మక విధానాలు రూపొందించి గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెంచాలన్నారు. ఈ సమావేశంలో ఫారెస్ట్ డివిజన్ అధికారి మక్సూద్, మణుగూరు, అశ్వాపురం, ఏడూళ్లబయ్యారం రేంజర్‌లు ఉపేందర్, రమేశ్, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నేడు అశ్వాపురంలో పర్యటన

అశ్వాపురం: మండలంలో సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అశ్వాపురం, తురుములగూడెం, గొల్లగూడెం, చింతిర్యాల, చింతిర్యాలగూడెం, సంద్రలబోడు గ్రామ పంచాయతీలలో ఎమ్మెల్యే పాయం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం మల్లెలమడుగులో ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఎమ్మెల్యే పర్యటనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు ఎంపీ పర్యటన

ములకలపల్లి: ములకలపల్లి మండలంలో నేడు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మండలకేంద్రంతోపాటు పలుగ్రామాల్లో సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాల ప్రారంభోత్సవాలతోపాటు, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొంటారని, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు.

నేడు 'చలో పూసుగూడెం'

బూర్గంపాడు: జిల్లాలోని రైతాంగానికి సాగునీరు అందించాలనే డిమాండ్‌తో ఈ నెల 30వ తేదీన బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో పూసుగూడెం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి కోరారు. ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో ముల్కలపల్లి మండలం పూసుగూడెంలోని సీతారామ పంప్‌హౌస్ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి సాగునీరు ఇతర జిల్లాలకు తరలిస్తు జిల్లా రైతులకు చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'అటవీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి'

ములకలపల్లి: పోడు సాగుకు అవాంతరాలు కలిగిస్తున్న ఫారెస్ట్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పోడు సాగుదారుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఏన్నోఏళ్లుగా పోడు సాగు చేస్తున్న భూముల్లో సేద్యానికి అటవీశాఖ అధికారులు అడ్డుతగలడం సరికాదని అన్నారు. గ్రామసభ ఆమోదించిన ప్రతీ ఎకరాకు పోడు పట్టాలివ్వాలని అన్నారు. ఊకంటి రవికుమార్, నాగబాబు, రమణ, చుక్కయ్య, లక్ష్మి, వెంకటమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢ బోనాల సందడి



బోనాలతో ఆలయానికి ప్రదర్శనగా వస్తున్న భక్తులు

అశ్వారావుపేటరూరల్: ఆషాఢ మాసం నేపథ్యంలో అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాల చెరువు గ్రామంలో ఆదివారం బోనాల సందడి నెలకొంది. గ్రామ శివారులో స్వయంభు కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించగా.. భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామంలో ఉన్న ముత్యామ్మ ఆలయంలో భక్తులు పూజలు చేసి అక్కడి నుంచి బోనాలను తలపై పెట్టుకొని మేళతాళాలు, కోలాట నృత్యాలతో ప్రదర్శనగా శ్రీకనక దుర్గమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి బోనాలు సమర్పించారు. అలాగే ప్రదర్శనలో అమ్మవార్ల వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు. దీంతో గ్రామంలో బోనాల జాతర ఉత్సవాలు సందడిగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా, ఆలయ పరిసరాలు భక్తులతో పోటెత్తాయి.



వివిధ రకాల వేషధారణలతో ప్రదర్శన..

ఇష్టారీతిన ఇసుక తోలకాలు



భారీ మిషన్ల సాయంతో వాగుల్లో ఇసుకను తోడుతున్న దృశ్యం

ములకలపల్లి: ములకలపల్లి మండలంలో ఇసుక అక్రమ తోలకాలు ఆగట్లేదు. ఓ వైపు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్న క్రమంలో స్థానిక అవసరాలకు ఇసుక అవసరం ఉన్నా, అక్రమారులు మాత్రం యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు. వాగుల్లో భారీ వాహనాలు పెట్టి, లారీల్లో బైటి ప్రాంతాలకు తరలిస్తున్నారు, అంగబలం, ఆర్థికబలం, రాజకీయ నేపథ్యాన్ని వాడుతూ అక్రమ రవాణాకు తెరలేపారు. మండలపరిధిలోని కొత్తూరు శివారులోగా ముర్రేడు వాగులో జేసీబీలు, చైన్‌మిషన్లు పెట్టి ఇసుక తోడుతున్నారు. పదుల సంఖ్యలో లారీల్లో ఇసుక బైటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత కొద్దిరోజులుగా సాగుతున్న ఈ చీకటి ఉదంతంపై సోషల్‌మీడియా వేదికగా వీడియోలు వైరల్ అవతున్నాయి.

పొంచిఉన్న ప్రమాదం



ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే పడేసి ఉన్న జామాయిల్ మొట్లు

ములకలపల్లి: ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన ఇష్టారీతిన పడేస్తున్న జామాయిల్ మొట్లతో పెనుప్రమాదం పొంచిఉంది. మండలపరిధిలోని కంపగూడెం క్రాస్‌రోడ్ నుండి మూకమామిడి క్రాస్‌రోడ్డు వరకూ తెలంగాణా స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో వేలాది ఎకరాల్లో జామాయిల్ తోటలను పెంచుతున్నారు. కాలవ్యవధి పూర్తయిన నేపథ్యంలో జామాయిల్ తోటలను కూకటివేళ్లతో సహా తొలగిస్తున్నారు. విలువైన కర్రను బయటకు విక్రయిస్తున్నారు. భూమిలోంచి తీసిన భారీ జామాయిల్ మొట్లను వేళ్లతో సహా తీసివేసి. ఆర్‌అండ్‌డీ రోడ్డు పక్కనే పడేస్తున్నారు. సుదూర ప్రాంతాలకు తరలించాల్సిన వీటిని పాల్వంచ-మందలపల్లి బీటీ రోడ్డు పక్కనే పడేసి, చేతులు దులుపుకుంటున్నారు. అటుగా వస్తున్న పలువురు వాహనదారులు ప్రమాదవశాత్తూ ఇప్పటికే ఈ మొట్లకు తగిలి ప్రమాదాల బారిన పడ్డారు. తీవ్రంగా గాయపడ్డారు. సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి, మొట్ల తరలింపుపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మేకులు కొట్టి.. బోర్డులు పెట్టి!

- ప్రచార సాధనాలుగా రోడ్ల పక్కన చెట్లు
- పలు విధాలుగా పబ్లిసిటీలో కంపెనీలు
- చెట్లు ఎండిపోయేందుకు అవకాశం!



బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో రోడ్డు పక్కన ఉన్న చెట్లకు కొట్టిన ప్లాస్టిక్ షీట్లు



భద్రాచలం బ్రిడ్జి సెంటర్‌లో రోడ్డు పక్కన..

భద్రాచలంఅర్బన్: భద్రాచలంతో పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రైవేటు కంపెనీలు, షాపుల నిర్వాహకులు రోడ్ల పక్కన ఉన్న చెట్లను ప్రచార సాధనాలుగా వాడుకుంటున్నారు. రైతులు పంట పొలాల్లో వివిధ పనుల నిమిత్తం ఉపయోగించే విత్తనాలతో పాటు వివిధ ప్రైవేట్ కంపెనీలకు చెందిన బ్యానర్లు, బోర్డులు రోడ్డు పక్కన ఉన్న చెట్లకు ఇబ్బడిముబ్బడిగా కడుతున్నారు. ఫైబర్, ప్లాస్టిక్, ఐరన్‌తో తయారు చేసిన షీట్లను కొడుతున్నారు. ఇందుకోసం మేకులు వినియోగిస్తున్నారు. దీనిద్వారా మొక్కలు, వృక్షాలు ఎండి పోతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మనిషి శరీరంలో ఇనుప వస్తువు గుచ్చుకుంటే సెప్టిక్ అవుతుందని, ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించు కోకపోతే క్రమేణా పుండుగా మారుతుందని చెబుతున్నారు. ఇలాగే చెట్లకు కొట్టిన మేకుల కారణంగా వాటికి పుండ్లవంటి గాయాలు ఏర్పడి ఈదురు గాలులకు విరిగిపోతున్నాయని పేర్కొంటు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బ్యానర్లు, పోస్టర్లు కట్టిన, అతికించిన ఆయా ప్రైవేటు కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

మతతత్వ రాజకీయాలు ప్రమాదకరం



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రేపాకుల శ్రీనివాస్

చండ్రుగొండ: మతతత్వ రాజకీయాలు దేశానికే ప్రమాదకరమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ అన్నారు. ఆ పార్టీ కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం అయన్నపాలెంలోని లక్ష్యాగార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం విశిష్టత- అఖిల భారత మహాసభ నిర్ణయాలు అనే అంశంపై రేపాకుల శ్రీనివాస్ కార్యకర్తలకు బోధించారు. మతాన్ని రాజకీయాలతో జోడించి బీజేపీ రాజ్యాంగాన్ని నీరుగారుస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీ మతానికి వ్యతిరేకం కాదని, మత ఉన్మాదానికి తాము వ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు ఐలూరి రామిరెడ్డి, జైతూన్‌బేగం, పెద్దిని వేణు, రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు, అప్పారి నాగేశ్వరరావు, దాసరి సీతారాములు, మిరియాల మోహన్‌రావు, నాగుల్ మీరా పాల్గొన్నారు.

మూలనపడిన ఆర్వో ప్లాంట్లు

- గవర్నర్ దత్తత గ్రామంలోనూ ఇదే పరిస్థితి..
- కొండరెడ్లకు అందని ద్రాక్షగా సురక్షిత తాగునీరు
- కలుషిత నీటితో వెంటాడుతున్న అనారోగ్యం



గవర్నర్ దత్తత గ్రామం పూసుకుంటలో అలంకారప్రాయంగా ఉన్న ఆర్వో ప్లాంట్



ఆర్వో ప్లాంట్‌లో వృథాగా ఉన్న తాగునీటిని శుద్ధి చేసే యంత్రాలు

అశ్వారావుపేటరూరల్: కొండరెడ్లకు సురక్షితమైన తాగునీరు అందించే ఉద్దేశంతో ఐటీడీఏ ద్వారా లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు(ఆర్వో ప్లాంట్) నిర్వహణ లేమితో మూలనపడ్డాయి. రాష్ట్ర గవర్నర్ దత్తత గ్రామంలో కుడా ఆర్వో ప్లాంట్ పని చేయడం లేదంటే అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. దీంతో కొండ్లరెడ్లకు సురక్షిత తాగునీరు అందుబాటులో లేక వాగులు, బోర్లపై ఆధారపడి కలుషిత నీటిని తాగి వ్యాధుల బారిన పడుతున్నారు.

అశ్వారావుపేట మండలంలోని పాత రెడ్డిగూడెం, బండారుగుంపు, గాండ్లగూడెం, కన్నాయిగూడెం, గోగులపూడితోపాటు గవర్నర్ దత్తత గ్రామమైన దమ్మపేట మండలం పూసుకుంట గ్రామాల్లో భద్రాచలం ఐటీడీఏ పర్యవేక్షణలో 2017–18వ సంవత్సరంలో ఒకొక్క మినరల్ వాటర్ ప్లాంట్‌ను రూ.6.5లక్షల ఖర్చుతో ఏర్పాటు చేశారు. కాగా, వీటిలో కొండరెడ్ల గ్రామాలైన అశ్వారావుపేట మండలంలోని పాత రెడ్డిగూడెం, దమ్మపేట మండలం పూసుకుంటలో ఉన్న ఆర్వో ప్లాంట్‌లు నిర్వహణ లేక, నిర్లక్ష్యం కారణంగా గడిచిన రెండేళ్లు పని చేయడం లేదు. ఈ ప్లాంట్‌లను ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణలో నిర్మించి, నిర్మాణాలను పూర్తి చేసిన తర్వాత ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించారు. దీంతో ఈ ప్లాంట్‌లను ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులే చూడాల్సిన బాధ్యత ఉంది. కానీ, పంచాయతీ బాధ్యులు నిర్లక్ష్యంగా కారణంగా ఆవి రెండేళ్లగా నిరూపయోగంగా మారాయి. వీటిని వినియోగించకపోవడంతో లక్షలు విలువ చేసే ప్లాంట్ పరికరాలు తుప్పు పడుతున్నాయి. పాత రెడ్డిగూడెం గ్రామంలో ఉన్న ప్లాంట్ మోటారు మరమ్మతులకు గురి కాగా, ఆ నాటి నుంచి రిపేరు చేయించలేదు. దీంతో ఆర్వో ప్లాంట్ వినియోగంలో లేకుండా పోవడంతో కొండరెడ్లకు సురక్షిత తాగునీరు అందని ద్రాక్షగా మారింది. గవర్నర్ దత్తత గ్రామంలో కూడా ఇదే పరిస్థితి నెలకొనగా, ఈ ప్లాంట్ గురించి కనీసం పట్టించుకునే నాథులే లేకుండా పోయారు.

కలుషిత నీరే దిక్కు!

కొండరెడ్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు పని చేయకపోవడంతో వారికి కలుషిత నీరే దిక్కుగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వానా కాలం సీజన్ కావడంతో ఆయా గ్రామాల ప్రజలు సమీపంలోని వాగులు, బోర్లపై ఆధార పడుతుండగా, ఈ నీటితో జ్వరం, కామెర్ల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో పాత రెడ్డిగూడేనికి చెందిన ఉమ్మల చిన్న వెంకటరెడ్డి(38) అనే వ్యక్తి జ్వరంతోపాటు కామెర్లు, ఇతర కారణాలతో మృత్యువాతకు గురైన సంగతి తెలిసిందే. అలాగే మరికొంతమంది గ్రామస్తులు కుడా కలుషిత నీరు కారణంగా జ్వరాల బారిన పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి, కొండరెడ్లకు మినరల్ వాటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం..



ఆర్వో ప్లాంట్ పని చేయడం లేదనే విషయం ఇప్పటి దాకా నా దృష్టికి రాలేదు. ఈ సమస్య గురించి పాత రెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకుంటాను. అదే విధంగా ఆర్వో ప్లాంట్ పని చేసే విధంగా తగిన చర్యలు తీసుకుంటాను.

– ప్రవీణ్ కుమార్, ఎంపీడీఓ, అశ్వారావుపేట

క్లుప్తంగా

సెర్ప్ ఆధ్వర్యంలో శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని గ్రామ సంఘం పదాధికారులకు పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఐకేపీ ఆధ్వర్యంలో మండల అభివృద్ధి కార్యాలయంలో ఆదివారం శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెర్ప్ తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ వసంత సేన పాల్గొని మాట్లాడారు. గ్రామ సంఘం పాలక వర్గం ప్రతినిధులు సంఘాల బలోపేతానికి కృషి చేయాలని, సమావేశాలు, పుస్తక నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు గ్రామ సంఘం సమావేశంలోనే జరగాలన్నారు. అలాగే క్రమం తప్పని సమావేశాలు తప్పకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు అధ్యక్షురాలు విజయశ్రీ, కార్యదర్శి సీతమ్మ, కోశాధికారి సుశీల, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రంగారావు, మండల ఏపీఎం హేమంతిని, సీఆర్‌పీలు విజయలక్ష్మి, విజయ, సీసీ ప్రసాద్, నర్సింహారావు, కృష్ణ, కోటేశ్వరరావు, రమణ, కిషోర్, ఎంఎస్ అక్కౌంటెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డును వెంటనే నిర్మించాలి



చిత్తడిగా మారిన రోడ్డును పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ యువజన నాయకులు

మణుగూరురూరల్: మున్సిపాలిటీలోని నాయుడుకుంట చెరువు కట్ట ప్రాంతంలో సీసీ రోడ్డును వెంటనే నిర్మించాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గుర్రం సృజన్ డిమాండ్ చేశారు. ఆదివారం బీఆర్‌ఎస్ పట్టణ యువజన విభాగం నాయకులు అధ్వానంగా ఉన్న రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా గుర్రం సృజన్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పూలమార్కెట్ నుండి చికెన్ మార్కెట్‌మీదుగా శివలింగాపురం వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక పాలకులు ఆ నిధులు వెనక్కి పంపించడం సరైన చర్య కాదన్నారు. చిరు వర్షాలకే నాయుడుకుంట చెరువు రోడ్డు చిత్తడిగా మారి అధ్వానంగా దర్శనమిస్తోందన్నారు. తద్వారా వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి సీసీ రోడ్డును వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్‌ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు జక్కం రంజిత్, రెబల్‌బాజీ, తురక వెంకటేష్, కోటి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపు సీపీఐ మహాసభ



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి రవికుమార్

దుమ్ముగూడెం: మండలంలోని గంగోలు ఫంక్షన్ హాల్‌లో జూలై 1వ తేదీన జరిగే సీపీఐ 20వ మండల మహాసభను జయప్రదం చేయాలనీ ఆ పార్టీ మండల కార్యదర్శి రావులపల్లి రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం నర్సాపురంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరుపేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ఈ మహా సభకు ముఖ్య నాయకులు హాజరు అవుతారన్నారు. ఈ సభా వేదికగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ వాగ్దానాలు అమలు కోసం పోరాటాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితమే తెలంగాణలో 10 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచిందని గుర్తు చేశారు. గిరిజనులు సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని పట్టాలు వచ్చేవరకు పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. సొసైటీ చైర్మన్ ఎల్లారెడ్డి, బొల్లోజు వేణు, తాటిపూడి రమేష్,అమరవాది శంకర్, కాకా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లికి పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలో ఉన్న చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.